సాక్షి
నల్లగొండ
గురువారం । 27 । ఏప్రిల్ । 2023



పథకాలు అందించాలి
ప్రభుత్వ పథకాలను మైనార్టీలకు అందించాలని జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షహజాది కోరారు. - 8లో



బెట్టింగ్ ముఠా గుట్టు రట్టు
క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ముఠా గుట్టును నల్లగొండ పోలీసులు రట్టు చేశారు. - 8లో

గరిష్టం/కనిష్టం
36° / 24°

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జిల్లా జడ్జిగా నాగరాజు బాధ్యతల స్వీకరణ



జిల్లా జడ్జి ఎం.నాగరాజుకు మొక్క అందజేస్తున్న జ్యుడీషియల్ ఉద్యోగులు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఎం.నాగరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఇక్కడ పనిచేసిన బిఎస్.జగ్జీవన్‌కుమార్ ఖమ్మం జిల్లాకు బదిలీ కాగా ఆయన స్థానంలో ఎం.నాగరాజు బదిలీపై వచ్చారు. బుధవారం ఉదయం చెర్వుగట్టు జడల రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద పండితుల ఆశీర్వచనాలు స్వీకరించిన అనంతరం కోర్టులోని ఆయన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు.

స్వాగతం పలికిన జ్యుడీషియల్ ఎంప్లాయీస్..
నల్లగొండ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎం.నాగరాజుకు జ్యుడీషియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు ఘన స్వాగతం పలికారు. జిల్లా జడ్జికి మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వీరబాబు, లతీఫ్, సాగర్‌రెడ్డి, గిరి, గణపతిరావు, వంశీ, అజారుద్దీన్, ఉష, సరస్వతి, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి బదిలీ

రామగిరి (నల్లగొండ) : మిర్యాలగూడ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి చిరంజి ఆశలత బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో కరీంనగర్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి బి.సుజయ్ మిర్యాలగూడకు వస్తున్నారు. కాగా చిరంజి ఆశలత మహబూబ్‌నగర్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ మేరకు హైకోర్టు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

చందంపేట జెడ్పీటీసీ సభ్యురాలిగా బుజ్జి

- ప్రమాణ స్వీకారం చేయించిన అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా



ప్రమాణ స్వీకారం చేస్తున్న బుజ్జి

నల్లగొండ : చందంపేట జెడ్పీటీసీగా కాంగ్రెస్ పార్టీకి చెందిన నేనావత్ బుజ్జి బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. నల్లగొండలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆమె చేత స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా ప్రమాణ స్వీకారం చేయించారు. గతంలో చందంపేట జెడ్పీటీసీ సభ్యురాలిగా ఉన్న రమావత్ పవిత్ర ఈ ఏడాది ఫిబ్రవరిలో రాజీనామా చేశారు. పవిత్ర వయస్సు విషయమై కోర్టు తీర్పు నేపథ్యంలో బుజ్జిని జెడ్పీటీసీగా ప్రకటించి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ బాలునాయక్, పీఏపల్లి జెడ్పీటీసీ అలుగుబెల్లి శోభారాణి, నల్లగొండ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, చందంపేట ఎంపీపీ పార్వతి జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ కాంతమ్మ పాల్గొన్నారు.

బదిలీలు, ప్రమోషన్లపై చొరవ తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కె.జంగయ్య

రామగిరి(నల్లగొండ) : టీచర్ల బదిలీలు, ప్రమోషన్లపై ప్రభుత్వం చొరవ తీసుకొని వేసవి సెలవుల్లో పూర్తిచేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి డిమాండ్ చేశారు. బుధవారం నల్లగొండలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లాకార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పాఠశాలల ప్రారంభం నాటికి బదిలీలు, ప్రమోషన్లు పూర్తిచేస్తే విద్యార్థులకు న్యాయం చేకూరుతుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల్లో శాస్త్రీయత దెబ్బతినేలా పాఠ్య పుస్తకాల్లో చార్లెస్ డార్విన్ సిద్ధాంతం తొలగించి మత భావాలను చేర్చడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి, జి.నాగమణి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎడ్ల సైదులు, పెరుమాళ్ల వెంకటేశం, శ్రీనివాసచారి, అరుణ, నర్రా శేఖర్‌రెడ్డి, నరసింహ, శ్రీనివాస్‌రెడ్డి, రమాదేవి ఉన్నారు.

రైతన్నకు 'అకాల' నష్టం

వేల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- కొనుగోలు కేంద్రాల్లో క్వింటాళ్ల కొద్దీ తడిసిన ధాన్యం
- మొలకెత్తుతున్న వడ్లు
- తీవ్ర ఆందోళనలో రైతులు



ఈ ఫొటోలో వడ్లు ఆరబెడుతున్న రైతు ఉప్పుల లింగయ్య. ఈయనది కేతేపల్లి. తనకున్న ఎకరన్నర భూమికి తోడు మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశాడు. ఎకరాకు రూ.30 వేల చొప్పున రూ.1.50 లక్షలు పెట్టుబడి పెట్టాడు. పది రోజుల కిందట పంట కోయించి స్థానిక పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో చోటు లేక పోవటంతో సర్వీసు రోడ్డుపై ధాన్యం ఆరబోశారు. ఐదో రోజుల కిందట కురిసిన వర్షానికి వడ్లు తడిసిపోయాయి. అష్టకష్టాలు పడి ఆరబెడితే మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి మళ్లీ తడిసింది. దీంతో ఆ రైతు తీవ్ర ఆవేదనలో పడ్డాడు.



మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి చిట్యాల మండలం వెలిమినేడు కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశుల చుట్టూ నిలిచిన నీరు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : అకాల వర్షాలు రైతులకు అపార నష్టాన్ని మిగిల్చాయి. వరి కోతలు చివరి దశలో ఉన్న పొలాల్లో వడ్లు రాలిపోగా.. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు లేక క్వింటాళ్ల కొద్దీ ధాన్యం తడిపోయింది. పలు చోట్ల ధాన్యం రాశులు కొట్టుకుపోయాయి. తడిసిన ధాన్యం మొలకలు వస్తోంది. భారీ వర్షం కారణంగా కోతకు వచ్చిన వరిచేలు నేలవాలాయి. సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో అత్యధికంగా పంట నష్టం వాటిల్లగా, యాదాద్రి జిల్లాలోనూ వేయికి పైగా ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. వరితోపాటు మామిడి వంటి ఉద్యానవన పంటల రైతులు నష్టపోయారు.

7,447 ఎకరాల్లో పంటనష్టం
అకాల వర్షాలకు నల్లగొండ జిల్లాలో 7,447 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. అందులో ఈనెల మొదట్లో కురిసిన అకాల వర్షాలకు గుర్రంపోడు, చండూరు, శాలిగౌరారం, మునుగోడు, కనగల్, నల్లగొండ మండలాలకు చెందిన 2,556 మంది రైతులు 4,907 ఎకరాల్లో పంట నష్టపోగా, ఈ ఐదు రోజుల్లో కురిసిన వర్షాలకు చండూరు, కట్టంగూరు, శాలిగౌరారం, డిండి, దేవరకొండ, చందంపేట మండలాల్లో 1,335 మంది రైతులకు చెందిన 2,540 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. అందులో డిండి మండలంలో అత్యధికంగా 1,245 ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. మొత్తంగా జిల్లాలో రైతులకు రూ.30 కోట్లకుపైగా నష్టం వాటిల్లినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇక సూర్యాపేట జిల్లాలో 26,177 ఎకరాల్లో పంటలకు నష్టం జరిగినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనా వేయగా, యాదాద్రి జిల్లాలో అకాల వర్షాలతో వేయి ఎకరాల్లో వరి, వంద ఎకరాల్లో మామిడి తోటలు దెబ్బతిన్నాయి.

వడగండ్ల వర్షం అప్పులపాలు చేసింది



నాకున్న అర ఎకరంతోపాటు ఆరు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగుచేశా. అప్పు చేసి రూ.1.8 లక్షలు పెట్టుబడి పెట్టా. రెండు రోజుల్లో వరికోత మొదలు పెడదామనుకుంటున్న సమయంలో కురిసిన అకాల వర్షంతో కనీసం వరి కోసేందుకు కూడా వీలులేకుండా చేను మొత్తం నేలకు అనుకుంది. 90 శాతం ధాన్యం నేలరాలింది. కౌలు డబ్బులు చెల్లించేందుకు సరిపడా దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు.
– భీమగాని శ్రీను, చిత్తలూరు, శాలిగౌరారం మండలం

అప్పు ఎలా తీర్చాలో



నాకున్న ఐదు ఎకరాల్లో వరి సాగు చేశా. పంట కోత దశలో ఉండగా, సోమవారం వడగండ్లతో కురిసిన అకాల వర్షానికి 4 ఎకరాల విస్తీర్ణంలో వడ్లు నేల రాలిపోయాయి. పెట్టుబడి కోసం చేసిన రూ.లక్షన్నర అప్పు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు.
– మధుసూదన్, ప్రతాప్‌నగర్, డిండి మండలం

21వ తేదీ నుంచి వర్షాలకు దెబ్బతిన్న పంటల అంచనా (ఎకరాల్లో..)

మండలం	వరి	ఉద్యాన
చండూరు	200	0
కట్టంగూరు	0	60
శాలిగౌరారం	320	0
డిండి	1245	0
దేవరకొండ	374	4
చందంపేట	284	26

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

చిట్యాల : వెలిమినేడు, చిన్నకాపర్తి, పిట్టంపల్లి గ్రామాలల్లో ఏర్పాటు చేసిన పీఏసీఎస్, ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి తడిసిన ధాన్యాన్ని బుధవారం డీసీఎస్ఓ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం వర్షానికి తడిసినట్లయితే ఆరబెట్టిన అనంతరం కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ రుద్రారపు భిక్షం, వైస్ చైర్మన్ బొంతల అంజిరెడ్డి, సివిల్ సప్లయ్ ఆర్ఐ లింగస్వామి తదితరులు ఉన్నారు.

ఉద్రిక్తత నడుమ ప్రజాభిప్రాయ సేకరణ



ప్రజాభిప్రాయ సేకరణకు హాజరైన గ్రామస్తులు

త్రిపురారం : మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామంలోని డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ పరిశ్రమలో నూతన కట్టడాల అనుమతులపై బుధవారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ ఉద్రిక్తత నడుమ సాగింది. పెద్దదేవులపల్లి గ్రామంలో ఉన్న డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ పరిశ్రమలో నూతన కట్టడాలకు అనుమతులు కోరుతూ నూతన పంచాయతీ రాజ్ చట్టం –2018 ప్రకారం పరిశ్రమ యాజమాన్యం సుమారు మూడు నెలల క్రితం దరఖాస్తు చేసుకుంది. దానికి పంచాయతీ పాలకవర్గం అనుమతి నిరాకరించింది. దీనిపై జిల్లా అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఓల్ ప్రతాప్‌నాయక్ ఆధ్వర్యంలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ లైజన్ ఆఫీసర్ శరత్‌చంద్రారెడ్డి సమక్షంలో పెద్దదేవులపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో బుధవారం గ్రామసభ నిర్వహించి గ్రామస్తులు, పంచాయతీ పాలకర్గసభ్యుల నుంచి వివరాలు సేకరించారు. డాక్టర్ రెడ్డిల్యాబ్ యాజమాన్యం గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే ఒప్పందాన్ని పట్టించుకోవడం లేదని గ్రామస్తులు మండి పడ్డారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గ్రామ ఒప్పందం ప్రకారం గ్రామంలోని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, కెమికల్ వాటర్ వల్ల పంటలు పండని వ్యవసాయ భూములకు ఏటా నష్ట పరిహారం చెల్లించాలని, గ్రామంలో మంచినీరు వచ్చేలా చూడాలని తదితర డిమాండ్లను గ్రామస్తులు.. యాజమాన్యం, అధికారుల ముందు ఉంచారు. అనంతరం డీపీఎల్ఓ ప్రతాప్ నాయక్ మాట్లాడుతూ గ్రామస్తుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని జిల్లా అధికారులకు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఠాకూర్ బాలారాణిబాయి రాజారాంసింగ్, ఎంపీఓ భిక్షంరాజ్, ఉపసర్పంచ్ మంగ, ఎంపీటీసీ అంబటి రాము, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నరేందర్, అంబటి సోమయ్య, వెంకటేశ్వర్లు, క్రాంతి, వెంకన్న పాల్గొన్నారు.

మేలో 'బ్రాహ్మణ వెల్లెంల' ప్రారంభం

- నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి : బ్రాహ్మణవెల్లెంల – ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకం పనులు పూర్తి కావచ్చాయని, మే నెలలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభిస్తామని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పేర్కొన్నారు. బుధవారం నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లెంలో జరుగుతున్న పనులను అధికారులతో కలిసి ఎమ్మెల్యే చిరుమర్తి పరిశీలించారు. అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. లక్ష ఎకరాలకు సాగునీరు అందించే బ్రాహ్మణ వెల్లెంల – ఉదయ సముద్రం ఎత్తిపోతల పనుల్లో భాగంగా కాల్వ పనులకు ప్రస్తుతం రూ.40 కోట్ల మంజూరు చేశారని తెలిపారు. అన్ని పనులు పూర్తి చేసి మేలో ట్రయల్ రన్ చేయిస్తామన్నారు. త్వరితగతిన పనులను పూర్తి చేసి మే నెలలో ప్రాజెక్టు ప్రారంభించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఆయన వెంట రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు యానాల అశోక్‌రెడ్డి, ఎంపీటీసీ చిరుమర్తి యాదయ్య, సర్పంచ్ కొత్త నర్సింహ, సైదులు, నరేష్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కాంగ్రెస్ నిరుద్యోగ ఉద్యమానికి సన్నద్ధం

- 28న ఎంజీయూలో విద్యార్థులతో భేటీ కానున్న టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి
- మర్రిగూడ బైపాస్ నుంచి పాదయాత్ర
- క్లాక్‌టవర్ వద్ద బహిరంగ సభ
- యువతను భారీగా సమీకరించేందుకు ప్రణాళిక



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ వ్యవహారంలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఈనెల 28వ తేదీన నిర్వహించబోయే నిరుద్యోగ ఉద్యమానికి భారీ ఎత్తున యువతను సమీకరించేందుకు జిల్లా కాంగ్రెస్ పార్టీ సిద్ధమైంది. ఈ సభకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితోపాటు నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీనియర్ నేతలు జానారెడ్డి, దామోదర్‌రెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు పాల్గొనేలా కార్యాచరణ సిద్ధం చేస్తోంది. నిరుద్యోగ ఉద్యమంలో భాగంగా ఈనెల 28వ తేదీన సాయంత్రం 5 గంటలకు మహాత్మాగాంధీ యూనివర్సిటీలో విద్యార్థులతో రేవంత్‌రెడ్డి భేటీ కానున్నారు. ఆ తర్వాత మర్రిగూడ బైపాస్‌లోని అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించనున్నారు. అక్కడి నుంచి క్లాక్‌టవర్ వరకు రేవంత్‌రెడ్డి పాదయాత్ర నిర్వహించి.. క్లాక్‌టవర్ వద్ద నిర్వహించే బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి, సీనియర్ నేతలు ప్రసంగిస్తారని డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ తెలిపారు.

ఓకే చెప్పడంతోనే సభ నిర్వహణ!
రేవంత్‌రెడ్డి ప్రకటించిన ప్రకారం కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగ ఉద్యమం ఈనెల 21వ తేదీనాడే మహాత్మాగాంధీ యూనివర్సిటీలో నిర్వహించాల్సి ఉంది. స్థానిక ఎంపీ అయిన తనకు తెలియకుండా తన పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని యూనివర్సిటీలో పార్టీ అధ్యక్షుడు కార్యక్రమం ఎలా నిర్వహిస్తారని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది తనకు అవమానకరమని పార్టీ పెద్దలకు ఫిర్యాదు చేశారు. దీంతో సభ వాయిదా పడింది. దీంతో ఏఐసీసీ కార్యదర్శి నదీమ్ షా, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావుఠాక్రే రంగంలోకి దిగి దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో రేవంత్‌రెడ్డితో మాట్లాడారు. ఇద్దరి మధ్య సయోధ్య కుదిర్చారు. ఈనెల 28వ తేదీన నల్లగొండలో సభ నిర్వహణకు సహకరించాలని ఉత్తమ్‌ను ఒప్పించారు. దీంతో 28వ తేదీన సభ నిర్వహించేలా మళ్లీ షెడ్యూల్ ఖరారు చేశారు.

మండలాల వారీగా బాధ్యతలు



నల్లగొండలో రేవంత్‌రెడ్డి నిర్వహించబోయే పాదయాత్ర, క్లాక్‌టవర్ వద్ద జరిగే సభకు పెద్ద ఎత్తున యువత హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నాం. వారితోపాటు పార్టీ శ్రేణులు కూడా పాల్గొంటారు. ఇందుకోసం మండలాల వారీగా పార్టీ ముఖ్య నాయకులకు బాధ్యతలు అప్పగించాం. నిరుద్యోగ ఉద్యమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తాం. ఈ కార్యక్రమానికి కార్యకర్తలు, నిరుద్యోగులు, విద్యార్థులు పెద్ద ఎత్తున్న తరలిరావాలి.
– శంకర్‌నాయక్, డీసీసీ అధ్యక్షుడు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆధునిక వైద్యం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

- సీఎం కేసీఆర్ హయాంలోనే అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు
- విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

నల్లగొండ : ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారంలోకి వచ్చాకే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆధునిక వైద్యం అందుబాటులోకి వచ్చిందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం సాయంత్రం నల్లగొండలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యా సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతకుముందు ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కోడి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న సిబ్బందికి హెల్త్ కార్డులు ఇవ్వాలన్న డిమాండ్‌పై మంత్రి జగదీశ్‌రెడ్డి సైవిధంగా స్పందించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ హయంలోనే విద్యా, వైద్య రంగాలలో విప్లవాత్మకమైన మార్పులు సంభవించాయన్నారు. హెల్త్‌కార్డులు అవసరం లేకుండానే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆధునిక వైద్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. విద్యా రంగంలోనూ సంచలనాత్మకమైన మార్పులు వచ్చాయని.. గురుకులాలో సీట్లకు పెరిగిన డిమాండే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న వారికి ప్రొఫెషనల్ ట్యాక్స్ సమస్య ఉత్పన్నం కాదన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన ప్రైవేట్ ఉపాధ్యాయులను అవార్డులతో సత్కరించారు. సమావేశంలో నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, డీఈఓ భిక్షపతి, ట్రస్మా నాయకులు యానాల ప్రభాకర్‌రెడ్డి, అనంతరెడ్డి తదితరులు ఉన్నారు.

3.2 మి. మీ సగటు వర్షపాతం

నల్లగొండ అగ్రికల్చర్ : అల్పపీడన ద్రోణి కారణంగా జిల్లాలోని 26 మండలాల్లో వర్షం కురిసింది. మంగళవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు సగటున 3.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా వర్షపాతం ఇలా ఉంది. చిట్యాల మండలం 17.2 మిల్లీమీటర్లు, గుండ్లపల్లి 10.7, చింతపల్లి 8.9, మర్రిగూడ 5.4 , తిప్పర్తి 5.2, నార్కట్‌పల్లి 5.1, మునుగోడు 4.5, శాలిగౌరారం 3.9, నాంపల్లి 3.6, కేతేపల్లి 3.5, నల్లగొండ 3.3, చండూరు 3.3, వేములపల్లి 3.3, కట్టంగూరు 3.2 నకిరేకల్ 2.9, మాడ్గులపల్లి 2.8, కనగల్ 2.6, దేవరకొండ, గుర్రంపోడు 2.4, పీఏపల్లి 1.5, చందంపేట 1, అనుముల 0.6, పెద్దవూర 0.6, త్రిపురారం 0.4, మిర్యాలగూడలో 0.4, నిడమనూరు మండలంలో 0.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఎన్‌హెచ్ 65పై బ్లాక్‌స్పాట్‌లకు విముక్తి

- రెండు చోట్ల అండర్‌పాస్‌ల నిర్మాణానికి మోక్షం
- నిర్ణయం తీసుకున్న కేంద్ర ప్రభుత్వం
- కి.మీ 40 నుంచి 221 మధ్యన నిర్మాణాలకు అడుగులు
- రూ.420.26 కోట్ల నిధులకు టెండర్లు ఆహ్వానం
- కేంద్ర రోడ్డు, రవాణా మంత్రిత్వ శాఖ ఆదేశాలు
- ఫలించిన ఎంపీ కోమటిరెడ్డి ప్రయత్నాలు



చౌటుప్పల్‌లో జాతీయ రహదారిపై రద్దీగా బస్టాండ్ జంక్షన్ (ఫైల్)

చౌటుప్పల్ : ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు వారధిగా ఉన్న హైదరాబాద్ – విజయవాడ 65వ నంబరు జాతీయ రహదారి అటు రద్దీలో, ఇటు ప్రమాదాల్లో భారతదేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందింది. గతంలో రెండు వరుసలుగా ఉన్న ఈ రహదారిని 2011సంవత్సరంలో నాలుగు వరుసలుగా నిర్మాణం చేశారు. అయితే అప్పటితో పోలిస్తే ప్రస్తుతం వేలాది వాహనాలు పెరగడంతో రహదారి మరోసారి రద్దీగా మారింది. నిత్యం ఎక్కడో ఓ చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అలా జరిగిన ప్రమాదాల్లో ఇప్పటి వరకు వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. అప్పట్లో రహదారి నిర్మాణం చేసిన సమయంలో జరిగిన తప్పిదాల కారణంగా ప్రమాదాలు పెరుగుతున్నాయి. ఆ క్రమంలో ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ, ఎన్‌హెచ్ఏఐ, కాంట్రాక్టు సంస్థ జీఎంఆర్ ఉమ్మడిగా కార్యాచరణ రూపొందించాయి. అందులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని 40.00వ కిలోమీటరు నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లా పరిధిలో ఉన్న 221.00వ కిలోమీటరు వరకు బ్లాక్ స్పాట్‌లను గుర్తించారు. రెండు ప్రాంతాల్లో ఎట్ గ్రేట్ జంక్షన్‌లను తొలగించాలని చాలా కాలం క్రితమే ప్రతిపాదించారు. అలా గుర్తించిన బ్లాక్‌స్పాట్‌ల తొలగింపునకు ఎట్టకేలకు మోక్షం లభించనుంది. ఈ మేరకు కేంద్ర రోడ్లు, రవాణా మంత్రిత్వ శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

గుర్తించిన బ్లాక్ స్పాట్‌లు	అంచనా విలువ(రూ. కోట్లలో)
పెద్దకాపర్తి	29.90
చిట్యాల	42.18
నల్లగొండ క్రాస్‌రోడ్డు, కట్టంగూర్	0.26
కొర్లపహాడ్	5.96
ఎస్‌వీ ఇంజనీరింగ్ కాలేజ్, జనగాం క్రాస్ రోడ్డు	58.04
ఈనాడు ఆఫీస్ ఎదురుగా	27.97
దురాజ్‌పల్లి	2.80
ముకుందాపురం	13.86
ఆకుపాముల	2.16
కొమరబండ ఎక్స్ రోడ్డు	31.01
కట్టకొమ్ముగూడెం	10.89
మేళ్లచెరువు	0.46
శ్రీరంగాపురం	8.50
రామాపురం ఎక్స్‌రోడ్డు	30.26
నవాబుపేట	0.21
మొత్తం	264.84

తీరనున్న ట్రాఫిక్ సమస్య
ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారి చాలా ఇబ్బందిగా మారింది. నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఇప్పటి వాహనాల సంఖ్యకు అనుగుణంగా రోడ్డు లేకపోవడంతో ఇరువైపులా వాహనాలు బారులుదీరి రాకపోకలు సాగిస్తున్నాయి. దీనికి తోడు ఎక్కడ ఏ చిన్న ప్రమాదం జరిగినా గంటల తరబడి వాహనాలు నిలిచిపోవాల్సి వస్తోంది. పండుగలు, వారాంతపు రోజుల్లో వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. వీటికి తోడు ఇప్పటికే గుర్తించిన బ్లాక్ స్పాట్‌లు, గ్రామాల జంక్షన్‌ల వద్ద జరుగుతున్న ప్రమాదాల్లో ఎంతో మంది మృత్యువాత పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో వీటన్నింటికీ పరిష్కారం లభించనుంది. అదే విధంగా చౌటుప్పల్ వంటి అభివృద్ధి చెందుతున్న ప్రాంతంలో ఎట్‌గ్రేట్ జంక్షన్ తొలగించి అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం చేయడంతో చౌటుప్పల్ పట్టణ రూపురేఖలు మారనున్నాయి.

ఎట్ గ్రేట్ జంక్షన్ తొలగింపు ప్రాంతాలు	
చౌటుప్పల్	114.40
టేకుమట్ల	41.42
మొత్తం	155.42

ఫలించిన ఎంపీ కోమటిరెడ్డి ప్రయత్నాలు
జాతీయ రహదారిపై తరచూ చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాదాల విషయంలో భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేసేవారు. ప్రమాదాలను నివారించాలన్న సంకల్పంతో చాలా రోజుల నుంచి కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రయత్నాలు ప్రారంభించారు. ఎప్పుడు వీలైతే అప్పుడు కేంద్ర మంత్రి నితీన్‌గడ్కరీని కలిసి విన్నవించేవారు. ఇప్పటికే గుర్తించిన బ్లాక్ స్పాట్‌ల పునర్నిర్మాణం, ఎట్ గ్రేట్ జంక్షన్‌ల తొలగింపు చేయాలని కోరారు. ఆ క్రమంలో కేంద్ర ప్రభుత్వం ఆయా పనుల కోసం రూ.420.26 కోట్లు మంజూరు చేసింది. దీంతో కోమటిరెడ్డి ప్రయత్నాలు ఫలించాయి.

క్లుప్తంగా

దాడి కేసులో ఏడాది జైలు

తుర్కపల్లి: ప్రభుత్వ అధికారులపై దాడి కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ భువనగిరి కోర్టు బుధవారం తీర్పు ఇచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తుర్కపల్లి మండలం ధర్మారం గ్రామ పరిధి కర్లగడ్డ తండా వాసుల నీటి అవసరాల కోసం 2018 సంవత్సరంలో అధికారులు బోరు వేస్తున్నారు. ఈ క్రమంలో అదే తండాకు చెందిన గుగులోతు ప్రభాకర్ రెవెన్యూ అధికారులు, పోలీసులపై దాడికి దిగాడు. దీంతో అప్పటి ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి ప్రభాకర్‌పై కేసు నమోదు చేసి, నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం నిందితుడికి ఏడాది జైలుతో పాటు రూ.1500 జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

చోరీ కేసులో నిందితుడికి జైలు, జరిమానా

బొమ్మలరామారం : చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ భువనగిరి కోర్టు ప్రిన్సిపాల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ నాగేశ్వరరావు తీర్పునిచ్చారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొమ్మలరామారం మండలం యావపూర్ గ్రామానికి చెందిన మూఢావత్ జయరాం కుటుంబం 2022 సంవత్సరం ఆగస్టు 31తేదీన ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లారు. గమనించిన మేడ్చేల్ మల్కాజిగిరి జిల్లా దుండిగల్ తండా డేరెల్ల దుర్గయ్య ఆ ఇంట్లో చోరీ చేసేందుకు ప్రయత్నించాడు. ఇరుగుపొరుగు వారు గమనించగా పారి పోయాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు. అదే ఏడాది అక్టోబర్ 10న కోర్టులో చార్జిషీట్ వేశారు. విచారణ అనంతరం న్యాయమూర్తి నిందితుడికి జైలు శిక్షతో పాటు జరిమానా విధించినట్లు ఎస్ఐ వెంకన్న, కోర్టు కానిస్టేబుల్ స్వామి, సురేందర్ రెడ్డి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో బాలిక మృతి

వలిగొండ : అనుమానాస్పద స్థితిలో ఓ బాలిక మృతిచెందింది. వలిగొండ మండలం ప్రొద్దుటూరులో బుధవారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వడ్డెబోయిన గణేశ్, అనిత దంపతుల కుమార్తె అక్షిత (15) మండల కేంద్రంలోని ఓ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తిచేసింది. కాగా, తల్లిదండ్రులు ధాన్యం ఆరబోసేందుకు ఉదయం కొనుగోలు కేంద్రానికి వెళ్లగా అక్షిత ఒంటరిగా ఉంది. మధ్యాహ్నం తండ్రి ఇంటికి రాగా లోపలి నుంచి గడియ వేసి ఉంది. తలుపులు కొట్టినా తీయకపోవడంతో కిటికీలోంచి చూడగా అక్షిత ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతూ విగతజీవిగా కనిపించింది. గణేశ్ లబోదిబోమనడంతో ఇరుగు పొరుగు వారు వచ్చి తలుపులు పగులగొట్టి చూడగా అప్పటికే అక్షిత మృతిచెందింది. సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ఆస్పత్రికి తరలించారు. అయితే, తమ కుమార్తె మృతిపై అనుమానం ఉందని అక్షిత తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శ్యామ్ సుందర్‌రెడ్డి తెలిపారు.

యాదాద్రిలో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పూజలు



లడ్డూ ప్రసాదం అందజేస్తున్న అధికారి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునితాలక్ష్మారెడ్డి, కుటుంబ సభ్యులు బుధవారం దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని పూజలు చేశారు. ఆచార్యులు ఆమెకు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయాధికారి రాజు లడ్డూ ప్రసాదం అందజేశారు.

మైనార్టీలకు పథకాలు అందించాలి

- జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షహజాది

నల్లగొండ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు మైనార్టీలకు అందించేందుకు కృషిచేయాలని జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షహజాది అధికారులను కోరారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానమంత్రి నూతన 15సూత్రాల కార్యక్రమం, మైనార్టీల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైనార్టీలకు వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న పథకాలపై సమగ్ర సమాచారాన్ని సేకరించి ఒక చిన్న పుస్తకం రూపంలో రూపొందించాలని ఆదేశించారు. షాదీ ముబారక్ పథకం పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలని కోరారు. మైనార్టీలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అదేవిధంగా జిల్లాలో ఎన్ని మైనార్టీ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ద్వారా మైనార్టీ చిన్నారులకు, గర్భిణులకు పౌష్టికాహారం అందుతున్న తీరును డీఈఓను అడిగి తెలుసుకున్నారు. వక్ఫ్ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని రెవెన్యూ, వక్ఫ్ బోర్డు అధికారులను కోరారు. కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇటీవల రంజాన్ పండుగ సందర్భంగా అసెంబ్లీ నియోజకవర్గాల వారిగా ఇఫ్తార్ పార్టీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదే విధంగా ఎస్పీ అపూర్వరావు మాట్లాడుతూ పోలీస్ శాఖ తరపున మైనార్టీలకు రక్షణ కల్పిస్తూ ప్రశాంత వాతావరణంలో పండగలు జరుపుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం మైనార్టీ ఆధ్యాత్మిక నాయకులు, ఎన్‌జీఓలతో కలెక్టర్ కార్యాలయంలో సమావేశమయ్యారు. తొలుత జిల్లాకు చేరుకున్న జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షహజాదికి కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అర్అండ్‌బీ అతిథి గృహంలో స్వాగతం పలికారు. సమావేశంలో ఆర్‌డీఓ జయ చంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమణచారి, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి గోశిక బాలకృష్ణ, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషన్ సభ్యురాలు చిత్రంలో కలెక్టర్, ఎస్పీ తదితరులు

జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలి పీఏపై దాడి

నల్లగొండ కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం జిల్లా మైనార్టీ నాయకులతో జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షహజాది నిర్వహించిన సమావేశంలో ఆమె పీఏ రాజేష్‌కుమార్‌పై ఎంఐఎం నాయకులు దాడి చేశారు. దీంతో సమావేశం అంతా గందరగోళంగా మారింది. వివారాల్లోకి వెళ్తే.. జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షహజాది బుధవారం నల్లగొండ కలెక్టరేట్‌లో జిల్లా మైనార్టీ నాయకులతో సమావేశమయ్యారు. సమస్యలపై మాట్లాడేందుకు నాయకులకు అవకాశం ఇచ్చారు. ఈ సమావేశంలో సీపీఎం మాజీ కౌన్సిలర్ సలీంతోపాటు పలువురు నాయకులు మాట్లాడారు. అయితే సమయం తక్కువగా ఉందని.. సమస్యలు మాత్రమే ప్రస్తావించాలని ఆమె నాయకులకు సూచించారు. ఆ సమయంలో వారి మధ్య మాటామాటా పెరిగింది. ఈ క్రమంలో సీపీఎం మాజీ కౌన్సిలర్ సలీంను బయటికి పంపించాలంటూ కమిషన్ సభ్యురాలు పోలీసులను ఆదేశించారు. దీంతో అదే సమయంలో సమస్యలు విననప్పుడు సమావేశం ఎందుకని ప్రశ్నిస్తూ.. సభలోని నాయకులంతా ఒక్కసారికి వేదిక వద్దకు వచ్చేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో ఆమె పీఏ రాజేష్‌కుమార్ వారిని అడ్డుకోబోయాడు. పీఏ వద్ద ఉన్న మైక్‌ను నాయకులు లాక్కోవడంతోపాటు చేయి చేసుకున్నారు. దీంతో సభ గందరగోళంగా మారింది. సమావేశాన్ని అర్ధంతరంగా ముగించారు. తన కళ్ల ముందే తన పీఏపై దాడి చేసిన ఎంఐఎం నాయకుడు రజియొద్దీన్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఎస్పీ అపూర్వరావుకు ఫిర్యాదు చేస్తూ ఆ ఫిర్యాదు కాపీని మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ ఆదిరెడ్డికి అందజేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ తాను మై నార్టీల సమస్యలు తెలుసుకోవడానికి వస్తే దాడి చేయడం ఎంతవరకు సమంజసమన్నారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న మైనార్టీ కమిషన్ సభ్యురాలు

థర్మల్ పవర్ ప్లాంట్ కార్మికుడి దారుణ హత్య

- బండరాయితో మోది ఘాతుకం
- ఘటన స్థలాన్ని పరిశీలించిన మిర్యాలగూడ డీఎస్పీ

మిర్యాలగూడ : దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామ శివారులోని యాదాద్రి థర్మల్‌పవర్ ప్లాంట్‌లో పనిచేస్తున్న ఓ కార్మికుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఝార్ఖండ్ రాష్ట్రం బీశ్యాపూర్ గ్రామానికి చెందిన రఘునందన్‌రామ్(42) పవర్ మేక్ సంస్థలో ఐదేళ్లుగా కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం విధులకు హాజరైన రఘునందన్‌రామ్ రాత్రి నుంచి కనిపించడం లేదు. కాగా, ఉదయం 11గంటల ప్రాంతంలో మండలం వీర్లపాలెం గ్రామ శివారు, పవర్ ప్లాంట్ సమీపంలో రఘునందన్ రామ్ రక్తపు మడుగులో విగతజీవుడిగా పడి ఉండడాన్ని స్థానికులు చూసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హత్యోదంతం వెలుగులోకి వచ్చింది. దుండగులు బండరాయితో మోది హత్య చేసినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. హతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సమాచారం మేరకు మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి ఘటన స్థలాన్ని పరిశీలించారు. హత్యకు గల కారణాలపై ఆరా తీశారు. రఘునందన్‌రామ్‌ను హత్య చేసింది ఎవరు? అందుకు గల కారణాలు ఏమిటీ? తదితర అంశాలపై విచారణ జరపనున్నట్లు డీఎస్పీ తెలిపారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ సత్యనారాయణ, వాడపల్లి ఎస్ఐ రవికుమార్ తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటగిరి

హత్య కేసులో ఒకరికి యావజ్జీవ శిక్ష

- వివరాలు వెల్లడించిన భువనగిరి డీసీపీ

చౌటుప్పల్ : హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష విధిస్తూ జిల్లా సెషన్స్ కోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. చౌటుప్పల్ మండలప పరిధిలోని తంగడపల్లి గ్రామ శివారులోని ఓ పరిశ్రమలో 2016 సంవత్సరంలో జరిగిన ఈ హత్య ఘటనకు సంబంధించి వివరాలను భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర బుధవారం తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. మండల పరిధిలోని తంగడపల్లి గ్రామానికి చెందిన తిరుమల సురేందర్ గ్రామ శివారులోని డిస్కవరీ పరిశ్రమలో సెక్యూరిటీ ఇంచార్జిగా పని చేసేవాడు. రంగారెడ్డి జిల్లా బాల్‌నగర్‌లోని గాంధీనగర్‌లోని ఐడీపీఎల్ కాలనీలో నివాసం ఉండే భువన్ కుమార్ ఝూ(29), అతని సోదరుడు వివేక్ ఝూ(25)లు సైతం అదే కంపెనీలో సెక్యూరిటీ గార్డులుగా పని చేసేవారు. డ్యూటీల పంపిణీ విషయంలో అన్నదమ్ములిద్దరికీ సెక్యూరిటీ ఇన్‌చార్జిసురేందర్‌తో గొడవలు జరిగేవి. దీంతో అదే సంవత్సరం మే 8న రాత్రి సమయంలో డ్యూటీలో ఉన్న సురేందర్‌తో గొడవకు దిగారు. కంపెనీ ప్రధాన ద్వారం వద్ద ఉన్న అతనిపై దాడి చేశారు. అదే కోపంతో తలపై బండ రాయితో కొట్టారు. దీంతో తీవ్ర గాయమైన సురేందర్ అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు విచారణ చేసిన అప్పటి సీఐ నవీన్‌కుమార్ అదే నెల 10వ తేదీన వివేక్‌ఝూ అరెస్టు చేసి కోర్టులో రిమాండ్ చేశారు. భువన్‌కుమార్ ఝూ పరారీలో ఉన్నాడు. విచారణ అనంతరం న్యాయమూర్తి బాలభాస్కర్‌రావు నిందితుడు వివేక్‌ఝూకు యావజ్జీవ శిక్ష విధిస్తూ తీర్పును వెలువరించారు. కాగా స్థానిక డీసీపీ ఉదయ్‌రెడ్డి, సీఐ మల్లికార్జున్‌రెడ్డిలను డీసీపీ అభినందించారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి బలవన్మరణం

బీబీనగర్: వేర్వేరు చోట్ల ఇద్దరు బలవన్మరణానికి పాల్పడ్డారు. బీబీనగర్, గుండాల మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని అంబర్‌పేట్ ప్రాంతంలో పటేల్‌నగర్‌కు చెందిన చెందిన మహమ్మద్ ఇనాయత్ చిన్న కూతురు అస్మాథసీన్(26)ను బీబీనగర్‌కు చెందిన మహ్మద్ మునవర్ పాషాతో 15నెలల క్రితం వివాహం జరిగింది. వీరికి 6నెలల పాప ఉంది. కాగా, వివాహ సమయంలో ఒప్పుకున్న ప్రకారం కట్నకానుకలను అప్పగించారు. అయినప్పటికీ భర్తతో పాటు అత్త మామలు అదనపు కట్నం తీసుకురావాలంటూ అస్మాథసీన్‌ను మానసికంగా వేధిస్తూ కొట్టడంతో నెల రోజుల క్రితం పుట్టింటికి వెళ్లింది. కుల పెద్దల సమక్షంలో మాట్లాడుకుని అస్మాథసీన్ తిరిగి భర్త ఇంటికి వచ్చింది. మళ్లీ వేధించడంతో మనస్తాపానికి గురైన అస్మాథసీన్ మంగళవారం రాత్రి ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి ఇనాయత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడు..

గుండాల : మండలంలోని వస్తుకొండురు గ్రామానికి చెందిన సింగారం భిక్షం, యాదమ్మల రెండో కుమారుడు సింగారం గణేష్ (22) మద్యానికి బానిసగా మారాడు. మంగళవారం రాత్రి మద్యం తాగి వచ్చి తల్లిదండ్రులపై దాడి చేశాడు. దీంతో వారు వ్యవసాయ బావి వద్దకు వెళ్లారు. బుధవారం ఉదయం తల్లిదండ్రులు ఇంటికి వచ్చి చూడగా గణేశ్ అపస్మారక స్థితిలో ఉన్నాడు. పక్కనే పురుగుల మందు డబ్బా ఉండడంతో అతడిని జనగామ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి సోదరుడు శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యాకన్న తెలిపారు.

సీఈఐఆర్ పోర్టల్‌తో చోరీకి గురైన ఫోన్లు రికవరీ

- 23మంది బాధితులకు అందజేత
- ప్రతి ఒక్కరూ సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి
- సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్

సూర్యాపేటక్రైం : పోయిన లేదా చోరీకి గురైన మొబైల్ ఫోన్లను త్వరితగతిన పట్టుకోవడానికి సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) వెబ్‌సైట్ ఉపయోగపడుతుందని సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ వెబ్‌సైట్‌లో వినియోగదారులు వివరాలు నమోదు చేసుకుంటే మొబైల్స్‌ను ఈ పోర్టల్ ద్వారా సులభంగా స్వాధీనం చేసుకునే ఆస్కారం ఉంటుందని తెలిపారు. అలా జిల్లా వ్యాప్తంగా రూ.4.50లక్షల విలువ గల 23 మొబైల్స్‌ను ఈ పోర్టల్ ద్వారా రికవరీ చేసి బుధవారం బాధితులకు అందజేసి వివరాలు వెల్లడించారు. ఈ పోర్టల్ నిర్వహణకు పోలీస్‌స్టేషన్లలో నోడల్ అధికారులను ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ పోర్టల్ ఆవశ్యకతను తెలుపుతూ ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. వినియోగదారులు ఐఎంఈఐ మొబైల్ నంబర్, బిల్, మీ సేవ రశీదు, పోలీస్‌స్టేషన్, మండలం , జిల్లా, రాష్ట్రం, పిన్ కోడ్ మొదలగు వివరాలతో ఈ పోర్టల్ నందు నమోదు చేసుకోవాలన్నారు. ఇలా నమోదు చేయడం వల్ల ఫోన్ ఐఎంఈఐ బ్లాక్ చేయబడి ఫోన్ పని చేయదన్నారు. ఇందులో ఎవరైనా సిమ్ కార్డ్ వేసుకుంటే ట్రేసబులిటీ రిపోర్ట్ వస్తుందని, దీని ఆధారంగా పోయిన మొబైల్ లొకేషన్ గుర్తించి స్వాధీనం చేసుకోవచ్చునన్నారు. పోయిన సెల్ ఫోన్‌లను అశ్రద్ధ చేస్తే ఫోన్‌లో ఉన్న వ్యక్తి గత ఆధారాలు దొంగిలించి నష్టాన్ని కలగజేస్తుందన్నారు. ఇది వ్యక్తిగత, సామాజిక భద్రతకు భంగం కలుగుతుందన్నారు. దొంగిలించిన ఫోన్‌లతో నేరాలకు పాల్పడే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. మొబైల్ ఫోన్లను రికవరీ చేసిన పోలీసు, నోడల్ అధికారులను ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో డీఎస్పీలు నాగభూషణం, వెంకటేశ్వర్‌రెడ్డి, రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ నర్సింహ, సీఐ రాజేష్, ఆంజనేయులు, రామలింగారెడ్డి, రాఘవులు, నాగర్జున, ఆర్ఐలు శ్రీనివాస్, శ్రీనివాస్ రావు, నర్సింహారావు, గోవిందరావు, ఎస్ఐలు సత్యనారాయణ, హరికృష్ణ, రవీందర్ ఉన్నారు.



రికవరీ చేసిన మొబైల్స్‌ను అందజేస్తున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్

క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టు రట్టు

- తొమ్మిది మంది నిందితుల అరెస్ట్
- రూ.1.12కోట్ల నగదు, రెండు కార్లు, 14సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం : క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ముఠా గుట్టును నల్లగొండ పోలీసులు రట్టు చేశారు. తొమ్మిది మంది నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.1.12కోట్ల నగదుతో పాటు రెండు కార్లు, 14సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి ఎస్పీ అపూర్వరావు వివరాలు వెల్లడించారు. మిర్యాలగూడ పట్టణానికి చెందిన బంటు రాకేష్ సులువుగా డబ్బు సంపాదించేందుకు మూడేళ్లుగా ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నాడు. ఇతను టెలిగ్రాం యాప్ ద్వారా హార్దిక్ బుక్కీ ప్యానల్ నుంచి మెయిన్‌లైన్ యాక్సెస్‌ను తీసుకున్నాడు. ఈ లింక్‌ను తన బావమరిది అయిన ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రైల్వేస్టేషన్ రోడ్డులో ఉండే కోల సాయికుమార్‌కు ఫార్వర్డ్ చేశాడు. ఈ లింక్‌లో ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రైల్వే స్టేషన్ ప్రాంతానికి చెందిన రాచబంతి జీవన్‌సాయికుమార్, ఇదే జిల్లా కేంద్రంలోని వండర్ కిడ్స్ స్కూల్ సమీపంలోని భక్తపోతన వీధికి చెందిన శాకమూరి ఉదయ్‌కుమార్, ప్రకాష్‌నగర్‌కు చెందిన కొండవేటి రాజేష్, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నామవరానికి చెందిన నోట్ల సత్యనారాయణ, మిర్యాలగూడ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన బంటు సంతోష్, షాబునగర్‌కు చెందిన గందం నవీన్‌కుమార్, బంటు వంశీకృష్ణ చేరారు. వీరంతా కొంతకాలంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నారు.

ఆర్థిక విభేదాలు తలెత్తడంతో..

కొంతకాలంగా క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఈ ముఠాలో ఆర్థిక లావాదేవీల్లో విభేదాలు తలెత్తాయి. దీంతో అందరూ కలసి ఒకే చోట బెట్టింగ్ చేసేందుకు నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా ముఠా సూత్రధారి అయిన బంటు రాకేష్‌తో కలిసి మిర్యాలగూడ పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీలోని సాయిదత్తా అపార్ట్‌మెంట్‌లో 303 ఫ్లాట్‌లో ఉంటూ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. కాగా, విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు సాయిదత్తా అపార్ట్‌మెంట్‌పై దాడి చేసి వారందరినీ అదుపులోకి తీసుకున్నారని ఎస్పీ వివరించారు. కేసును ఛేదించిన మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి, వన్‌టౌన్ సీఐ రాఘవేందర్, ఎస్ఐలు శివతేజ, విజయ్‌కుమార్, వెంకటేశ్వర్లు, సిబ్బంది గఫూర్, రవి, రెహమాన్, ఉస్సేన్, వీరబాబు, వెంకటేశ్వర్లు, సైదులును ఎస్పీ అభినందించారు.

దేవరకొండలో ముగ్గురు అరెస్ట్

దేవరకొండ: ఐపీఎల్ ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న ముగ్గురిని బుధవారం అరెస్టు చేసి వారి నుంచి రూ.3.76లక్షల నగదు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు దేవరకొండ ఇన్‌చార్జ్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం మీర్జాపూర్‌కు చెందిన శైలేష్‌కుమార్ అగ్రహరి, అదే పట్టణానికి చెందిన హిమాన్షుపటేల్‌లు పట్టణానికి చెందిన పులిజాల శ్రీను ఇంట్లో ఆన్‌లైన్ ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తుండగా మంగళవారం రాత్రి పోలీసులు సోదాలు నిర్వహించి పట్టుకున్నట్లు తెలిపారు. శైలేష్‌కుమార్ అగ్రహరిమూడేళ్లుగా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నాడని తెలిపారు. తన స్నేహితుడైన హిమాన్షుపటేల్ ద్వారా ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్‌ను డౌన్‌లోడ్ చేసుకొని బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎస్ఐలు సుధీర్‌కుమార్, సతీష్, సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, శంకర్, తదితరులున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అపూర్వరావు

రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎకరాకు రూ.20వేల నష్ట పరిహారం చెల్లించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్ష , కార్యదర్శులు కోటేశ్వరరావు, మండల వెంకన్న డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని న్యూ డెమోక్రసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లా కేంద్రంలో రెండు రోజుల పాటు నిర్వహించిన అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాలు విజయవంతంగా ముగిశాయని తెలిపారు. అనంతరం కౌన్సిల్ తీర్మానాలను విడుదల చేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, రైతుబంధు, సొంత ఇంటి స్థలం ఉన్న వారందరికీ రూ.ఐదు లక్షలు చొప్పున ఇవ్వాలని తీర్మానించినట్లు తెలిపారు. సమావేశంలో ఏఐకెఎంఎస్ సహాయ కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్, లాల్‌కుమార్,రాజు, భూమన్న, బజ్జూరు వెంకటరామిరెడ్డి, నందగిరి వెంకటేశ్వర్లు, పోటు లక్ష్మయ్య, బొడ్డు శంకర్, అలుగుబెల్లి వెంకటరెడ్డి, దశరథ, కోట మధు, కాకి మోహన్‌రెడ్డి, సంపేట కాశయ్య పాల్గొన్నారు.

వాగులో మునిగి బాలుడు మృతి



గౌతమ్ మృతదేహం

మిర్యాలగూడ టౌన్ : వాగులో ఈత కొట్టేందుకు వెళ్లిన ఓ బాలుడు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన కొండ సరిత–రవి దంపతుల కుమారుడు కొండ గౌతమ్ (10) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. పాఠశాలలకు సెలవులు రావడంతో సాయంత్రం స్నేహితులతో కలిసి గ్రామ సమీపంలో గల పాలేరు వాగుకు ఈతకు వెళ్లాడు. గౌతమ్ చెక్‌డ్యాం సమీపంలో నీటిలో దిగగా ఈత రాక ఇసుక కోసం తవ్విన గుంతలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగి మృతిచెందాడు. స్నేహితులు గ్రామానికి వెళ్లి విషయం తెలపడంతో కుటుంబ సభ్యులు వచ్చి బాలుడి మృతదేహాన్ని వెలికితీశారు. గౌతమ్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చికిత్స పొందుతున్న గీత కార్మికుడు మృతి

నూతనకల్ : తాటిచెట్టు పైనుంచి కింద పడి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గీత కార్మికుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నూతన్‌కల్ మండల పరిధిలోని తాళ్లసింగారం గ్రామానికి చెందిన ఆలేటి భిక్షం(60) వృత్తిరీత్యా గీత కార్మికుడు. రోజువారీ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం తాడిచెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతడిని సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో అక్కడినుంచి సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

బాలికపై ఇద్దరు యువకుల లైంగిక వేధింపులు ?

- పోలీసులను ఆశ్రయించిన బాధిత కుటుంబం
- రాజీ కోసం ప్రజాప్రతినిధుల ప్రయత్నాలు

నల్లగొండ క్రైం : బాలికపై ఇద్దరు యువకులు లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. నల్లగొండ మండలంలోని ఓ గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై విశ్వసనీయ వర్గాల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఇటీవల ద్విచక్ర వాహనం నడపడం నేర్చుకుంటోంది. ఇదే సమయంలో మద్యం మత్తులో ఉన్న అదే గ్రామానికి ఇద్దరు యువకులు బాలికను లైంగికంగా వేధించారు. భయాందోళన చెందిన బాలిక బైక్‌ను అక్కడే వదిలేసి ఇంటికి వెళ్లగా యువకులు కూడా అనుసరించారు. అనంతరం బాలిక తల్లితో కూడా యువకులు దురుసుగా ప్రవర్తించారు. దీంతో బాధితులు నల్లగొండ రూరల్ పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. అయితే, ఇద్దరు యువకులపై కేసు కాకుండా అదే గ్రామానికి చెందిన మండల స్థాయి ప్రజాప్రతినిధులు రాజీ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషిచేస్తోందని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండలోని లక్ష్మీ గార్డెన్‌లో జరిగిన పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యాసంస్థలను బలోపేతం చేయడంతోపాటు పేద, మధ్యతరగతి వారికి ఆంగ్ల విద్యను అందిస్తున్నది ఒక్క తెలంగాణ ప్రభుత్వమే అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి ఉపాధ్యాయులు అండగా ఉండాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పీఆర్‌టీయూ తెలంగాణను అగ్రగామిగా నిలిపే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలో పర్యటించి రానున్న ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా భిక్షంగౌడ్‌తోపాటు పెద్ద ఎత్తున ఉపధ్యాయులు పీఆర్‌టీయూ తెలంగాణ సంఘంలో చేరారు. వారికి రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి , సంఘం నాయకులు చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ప్రధానకార్యదర్శి శంకర్, భిక్షపతి, భాస్కర్‌గౌడ్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



భిక్షంగౌడ్‌కు బాధ్యతలు అప్పగిస్తున్న సంఘం నాయకులు చిత్రంలో ఎమ్మెల్యే కంచర్ల

పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా 'సుంకరి'

పీఆర్‌టీయూ తెలంగాణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సుంకరి భిక్షంగౌడ్‌ను ఎన్నుకున్నారు. ఇప్పటివరకు ప్రధాన కార్యదర్శిగా ఉన్న మారెడ్డి అంజిరెడ్డిని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య, మాజీ ఎమ్మెల్సీలు పాతూరి సుధాకర్, జనార్దన్‌రెడ్డి బాధ్యతలు అప్పగించారు.

'పీఆర్‌టీయూ టీఎస్ పటిష్టంగా ఉంది'

- సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డీవీఎస్ ఫణికుమార్, నారాయణరెడ్డి

నల్లగొండ : పీఆర్‌టీయూ టీఎస్ పటిష్టంగా ఉందని ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డీవీఎస్ ఫణికుమార్, కాళం నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండలో పీఆర్‌టీయూ టీఎస్ బహిష్కృత నేత మరో సంఘంలో చేరడానికి ఓ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించాడని, ఇతర జిల్లాల నుంచి సంఘం బాధ్యులతోపాటు బల నిరూపణ పేరుతో హాస్టళ్ల నుంచి విద్యార్థులను, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులను ఇతరులను పిలిపించుకుని వారిని పీఆర్‌టీయూ టీఎస్ బాధ్యులుగా వక్రీకరించారని ఆరోపించారు. జిల్లాలో 35 శాఖలకుగాను 33 మండల శాఖలు పీఆర్‌టీయూతోనే ఉంటామని ఏకగ్రీవంగా తీర్మానాలు చేసి జిల్లా శాఖకు పంపారని తెలిపారు.

కూలిన ధాన్యం బస్తాలు.. హమాలీలకు గాయాలు

పెన్‌పహాడ్ : ధాన్యం బస్తాలు కూలి మీదపడడంతో పలువురు హమాలీలకు గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని అనంతారం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, కేంద్ర నిర్వాహకులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణగూడెం పీఏసీఎస్ ఆధ్వర్యంలో గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో హమాలీలు ధాన్యాన్ని కాంటా వేశారు. అనంతరం బస్తాలను లారీలోకి ఎత్తుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కూలి మీద పడడంతో మామిడి వెంకన్న, ఉప్పరి వెంకన్న, భీంపంగి వెంకన్న, కడెం సుందరయ్యలకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న హమాలీలకు సర్పంచ్ బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆర్థికసాయాన్ని అందజేశారు. పరామర్శించిన వారిలో పీఏసీఎస్ చైర్మన్ నాతాల జానకిరాంరెడ్డి, తహసీల్దార్ శేషగిరిరావు ఉన్నారు.

హమాలీలకు మంత్రి పరామర్శ

గాయపడిన హమాలీలను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆస్పత్రిలో పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరారు.